క్లుప్తంగా

సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణ



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించిన దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో సిద్ధం పోస్టర్లను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు మంగళవారం ఆవిష్కరించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురు వేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సామర్లకోట పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, పెద్దాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడు కాపుగంటి కామేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, పార్టీ నాయకులు ఇరుసుమళ్ల సాయి, గోపు మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేడు సైన్స్ ఫెయిర్

పిఠాపురం: స్థానికంగా ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని మురాలశెట్టి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 30 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, బంగారు పతకం, రెండో బహుమతిగా ట్యాప్‌ట్యాప్, వెండి పతకం, మూడో బహుమతిగా అలెక్సా డివైస్, బ్రాంజ్ మెడల్స్ అందజేస్తామని వివరించారు.

అపర్ణాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు ప్రభాకరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం వెండి చీర, గాజులు, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నిర్వాహకులు

పెద్దాపురం: ప్రతి విద్యార్థీ నిబద్ధత, క్రమ శిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు అన్నారు. సామర్లకోట మండల పాస్టర్స్ ఆధ్వర్యంలో స్థానిక సీబీఎం పాఠశాల క్రీడా మైదానంలో పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులకు ప్రిపేర్స్ స్టూడెంట్స్ పేరిట మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సుమారు 600 మంది విద్యార్థులకు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కౌన్సిలర్ పాలిక కుసుమ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు నల్లూరి కళ్యాణ్, దూది రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త నీటికి కోనేరు సిద్ధం



నీరు నింపడానికి సిద్ధం చేసిన కోనేరు

సామర్లకోట: మహాశివరాత్రి ఉత్సవాలు, స్వామి వారి కల్యాణాన్ని దృష్టిలో ఉంచుకొని పంచారామ క్షేత్ర ఆలయ కోనేరులో నీటిని పూర్తిగా తొలగించి కొత్త నీటితో కోనేటిని నింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మట్లాడుతూ మార్చి ఆరో తేదీ నుంచి ఆలయంలో కల్యాణం, మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ కోనేటిలో స్నానాలు చేస్తారని, వారికి ఇబ్బంది లేకుండా ఉండేలా ఇప్పటి వరకు ఉన్న నీటిని తీసివేసి కొనేటిని ఎండ బెట్టినట్టు చెప్పారు. బుధవారం నుంచి గోదావరి జలాలతో నింపనున్నట్టు తెలిపారు.

పండగలా పట్టాభిషేకం

- గ్రామ సచివాలయాల్లో జోరుగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు
- లబ్ధిదారులకు ఇళ్లపై పూర్తి హక్కులు కల్పిస్తున్న ప్రభుత్వం
- మండలంలో 5013 కుటుంబాలకు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

కొత్తపల్లి: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. నవరత్నాలు–అర్హులందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఆ స్థలాలు, ఇళ్లపై పూర్తి హక్కులు కల్పిస్తూ గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసి పట్టాలను లబ్ధిదారులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోనూ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. సొంతింటి కలను నెరవేర్చడమే కాకుండా పైసా ఖర్చు లేకుండా ఇళ్ల పట్టాలను ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి అందించడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

4821 పట్టాలకు రిజిస్ట్రేషన్లు పూర్తి

కొత్తపల్లి మండలంలో 5013 ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయవలసి ఉండగా ఇప్పటి వరకూ 4821 పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. 100 శాతం రిజిస్ట్రేషన్‌లు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. పట్టాలు రిజిస్ట్రేషన్ చేసే ప్రాంతాలను బట్టి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఆస్తి మహిళలకు సొంతమవుతోంది.

90 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి

మండలంలోని 25 సచివాలయాల పరిధిలో 90 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో కొత్తపల్లి మండలంలో 5013 కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్ల సంతకాలతో రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను అధికారులు లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

1000కి పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 32 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణానానికి రుణాలు మంజూరు చేశారు. కొత్తపల్లి మండలంలో తొలి రెండు విడతల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి పూర్తిస్థాయిలో రుణాలు మంజూరు చేశారు. ప్రభుత్వ లే అవుట్లలో తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేశారు. మండలంలో ఇప్పటికే సుమారుగా 1000కి పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నాం

గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతం 90 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. నూరు శాతం రిజిస్ట్రేషన్‌లు త్వరలో పూర్తి చేస్తాం. స్థలాల సరిహద్దులు సవరణ, పట్టాల మార్పులు, చేర్పులపై లబ్ధిదారులు స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించాలి.

శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దారు, కొత్తపల్లి మండలం

పెద్ద కొడుకులా ఆదుకున్నారు



దీర్ఘకాలంగా అద్దె ఇంట్లో అవస్థలు పడ్డాం. నా భర్త విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన తరువాత మా కుటుంబం ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడింది. అటువంటి సమయంలో పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేనున్నానంటూ భరోసా కల్పించారు. గతేడాది జగనన్న కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు రుణం మంజూరు చేశారు. ఇపుడు ఆ ఇంటికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే దొరబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

వడిగే సత్యవతి, లబ్ధిదారు, కొత్తపల్లి

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఇల్లు లేని నాకు ఇళ్ల స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రుణం మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ ఇంటికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది. గత ప్రభుత్వాలు మాలాంటి ఇల్లు లేని నిరుపేదలను ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనేక రకాల పథకాలతో మాకు లబ్ధిచేకూరుతోంది.

హెచ్చిన మణి, లబ్ధిదారు, కొత్తపల్లి

యండపల్లిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం పర్యటన



యండపల్లిలో ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కొత్తపల్లి: మండలంలోని యండపల్లిలో మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం పర్యటించింది. రీ ప్రొడక్ట్ చైల్డ్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీస్తున్నట్టు నోడల్ అధికారి వి.అరుణ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పరంగా వైద్య సిబ్బంది ఎటువంటి సేవలు అందిస్తున్నారు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా ? లేదా ? పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నారా ? ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందుతున్నాయా ? అనే అంశాలపై గ్రామస్తులను ఆరా తీశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఆపరేషన్ థియేటర్, మందుల నిల్వలను పరిశీలించారు. ఓపీ నమోదుపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని నోడల్ అధికారి అరుణ తెలిపారు. కార్యక్రమంలో స్టాటిస్టికల్ అధికారి బి.విజయలక్ష్మి, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి మహేశ్వరరావు, డేటా మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో జేఎస్ రామారావు



శిక్షణ తరగతులకు హాజరైన బీఎల్‌ఓలు

- బూత్‌ల నిర్వహణ బాధ్యత బీఎల్‌వోలదే
- ఆర్డీవో, ఎన్నికల అధికారి రామారావు

పెద్దాపురం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిబ్బంది ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, ఆయా పోలింగ్ బూత్‌ల నిర్వహణ బాధ్యత బీఎల్‌వోలపై ఉందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం నియోజకవర్గంలోని సామర్లకోట అర్బన్, రూరల్ పరిధిలోని బీఎల్‌వోలకు ఎన్నికల ప్రక్రియపై శిక్షణ సదస్సు నిర్వహించారు. బీఎల్‌వోలు విధులను సక్రమంగా నిర్వర్తించాలని, కమిషన్ నిబంధనలపై మరింత పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బూత్‌ల వద్ద సౌకర్యాలు, నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఓటు వేసే విధానంపై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. వీవీ ప్యాట్, ఓటరు వెరిఫికేషన్ పేపరు, అడిట్ ట్రెలర్‌పై పూర్తి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు హాజరు కాని అధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం ఈవీఎంల పనితీరు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, బీఎల్‌ఓలతో పాటు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

సీనియర్ సెక్షన్ ఇంజినీరు రవికాంత్



రైల్వే స్టేషన్ పరిశుభ్రతపై మాట్లాడుతున్న రవికాంత్

సామర్లకోట: రైల్వే స్టేషన్ పరిధిలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు రవికాంత్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పరిధిలో కాంట్రాక్టుకు ఇచ్చిన నలుగురు సిబ్బంది నిర్వహణ లోపంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని, దీంతో మార్చి నెల నుంచి కొత్త విధానం అమలు చేయనున్నామన్నారు. రైల్వే స్టేషన్ ఆవరణలో ఎక్కడా చెత్త లేకుండా చేసేలా టెండర్లు పిలుస్తున్నామని, నిర్వహణ లోపం తలెత్తితే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేలా నిబంధనల్లో పొందుపరచినట్టు తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పీబీ దేవం గ్రామంలో అండర్ పాస్ సదుపాయం కల్పించాని ఆ గ్రామం పంచాయతీ నుంచి తీర్మానం వచ్చిందని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. ప్రయాణికులు తప్పని సరిగా డస్ట్ బిన్లను ఉపయోగించుకోవాలని సూచించారు. చీఫ్ హెల్త్ సూపర్‌వైజర్ కల్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఏవీకె శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు నర్సెస్ స్ట్రగుల్ కమిటీ వినతి



డీఎంహెచ్‌వో నరసింహ నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నర్సెస్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ వేదికగా నర్సెస్ స్ట్రగుల్ కమిటీ (రాష్ట్రంలోని అన్ని నర్సింగ్ అసోసియేషన్ల సంఘం)కి చెందిన 40 మంది సభ్యుల బృందం డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్‌ను కలిశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ వారు ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ముఖ్యమంత్రి సంకల్పాన్ని కొనియాడారు. అయితే 2014 కంటే ముందు ఉన్న వారిలో ఎన్ఆర్‌హెచ్ఎం పరిధిలో పనిచేసిన నర్సింగ్ సిబ్బందికీ అవకాశం కల్పించాలని విన్నవించారు. ప్రతి నెలా సకాలంలో జీతాలు అందేలా స్ట్రగుల్ కమిటీ తరపున నివేదించాలని కోరారు. ఈ నెల జీతాలు జమకాని విషయాన్ని డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీలలో స్టాఫ్ నర్సుల భద్రతపై చర్యలు తీసుకోవాలని కోరారు. సెక్యూరిటీ లేకపోవడం వల్ల నైట్ డ్యూటీలు చేసే నర్సుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కొద్ది రోజుల క్రితం తాళ్లపూడి మండలం అన్నదేవరపేట పీహెచ్‌సీలో నైట్ డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్సును ఓ తాగుబోతు భయపెట్టిన ఉదంతాన్ని ప్రస్తావించారు. సదరు సమస్యపై తక్షణమే స్పందించిన నాయక్ తగిన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీ స్థాయిలో ముగ్గురు స్టాఫ్ నర్సులు మాత్రమే పనిచేస్తున్నారనీ, మరో నర్సును నియమించాల్సిన అవసరం ఉందనీ తద్వారా ఎప్పుడైన నర్సు సెలవు పెడితే ప్రజలకు అందించే వైద్య సేవలకు ఆటంకం ఉండదని అన్నారు. దీంతో మరో నర్సు నియామకానికి అవకాశాన్ని పరిశీలించి నియమించేందుకు తగిన ఆదేశాలిస్తామని డీఎంహెచ్‌వో అన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన డీఎంహెచ్‌వో తన పరిధిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించి ఇతర విన్నపాలను ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చారు.

పారదర్శకంగా ఓటరు దరఖాస్తుల పరిష్కారం

- ఈఆర్వో వెంకటరావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటరావు

కాకినాడ: ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా రానున్న ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు తోడ్పాటు అందించాలని నియోజకవర్గ ఈఆర్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటర్ల తుది జాబితా ప్రచురణ అనంతరం తాజాగా ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని వివరించారు. ఇప్పటివరకు 10,482 దరఖాస్తులు రాగా 1005 తిరస్కరించామని, 6127 దరఖాస్తులను ఆమోదించామన్నారు. ఇంకా 3330 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. వీటిని కూడా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను ఈఆర్వో నివృత్తి చేశారు. ఓటర్ల జాబితాపై పత్రికలలో వచ్చిన కథనాలను కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామినేషన్ల తేదీకి పది రోజుల ముందు వరకూ కొత్త ఓట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ఎన్నికల కమిషన్ ఆదేశాల అనంతరమే తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ), ఏఈఆర్వోలు దొర, సీతాపతిరావు, మురళీకృష్ణ, గుంటూరు శేఖర్, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల పాత్ర అత్యంత కీలకం



కార్యక్రమానికి హాజరైన బీఎల్‌ఓలు

- ఈఆర్ఓ వెంకటరావు
- ఎన్నికల విధులపై శిక్షణ

కాకినాడ: రానున్న ఎన్నికలలో బీఎల్వోల పాత్ర అత్యంత కీలకమని సిటీ నియోజకవర్గ ఈఆర్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఎన్నికల విధులపై బీఎల్ ఓలు, సెక్టార్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికలకు ముందు రోజు, ఎన్నికలు జరిగే రోజున పని చేసే విధానం, ఈవీఎం, వీవీ ప్యాట్ నిర్వహణ, ఇతర అంశాలపై శిక్షకులు వీరికి అవగాహన కల్పించారు. సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది సందేహాలను నివృత్తి చేసుకొని, సంపూర్ణ అవగాహనతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకూ తావు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌వోలు దొర, సీతాపతిరావు, గుంటూరు శేఖర్, బీవీ మురళీకృష్ణ, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు

జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు



తేటగుంటలో మామిడి పూత, పిందెలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

తుని రూరల్: వాతావరణ మార్పుల కారణంగా ఆశించే తెగుళ్లు, పురుగులను సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు పాటిస్తే మామిడిలో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యానశాఖ కాకినాడ జిల్లా అధికారి నేతల మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని తేటగుంటలో మంగళవారం హార్టికల్చర్ ఆఫీసర్ జి.విజయలక్ష్మితో కలసి పర్యటించారు. పూత, పిందె దశల్లో తెగుళ్లు, పురుగులు సోకి పంటకు నష్టం కలిగిస్తాయన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మామిడికి తామర పురుగు, ఆకుగూడు పురుగు, తేనె మంచు పురుగు, కాండం తొలుచు పురుగు, పండు ఈగ, పక్షికన్ను తెగులు సోకే ప్రమాదం ఉందన్నారు. తెగుళ్ల లక్షణాలను గుర్తించి ఉద్యాన అధికారుల సూచన మేరకే రైతులు మందులు పిచికారీ చేయాలన్నారు. మోతాదుకు మించి మందులు పిచికారీ చేస్తే పెట్టుబడి పెరగడంతో పాటు దిగుబడి తగ్గుతుందని హెచ్చరించారు.

ఎలక్ట్రిక్ మోటారు బైక్ దగ్ధం

రౌతులపూడి: గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన ఎలక్ట్రిక్ మోటారు వాహనం దగ్ధమైంది. గ్రామంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు మోహన్ ఇంటి ఆవరణలో సోమవారం రాత్రి ఎలక్ట్రిక్ వాహనం పార్కింగ్ చేశాడు. రాత్రి పది గంటల సమయంలో మోటారు వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. బైక్ యజమాని మోహన్ ఇంట్లో నుంచి బయటకు వచ్చే సరికి పూర్తిగా కాలిబూడిదైంది. కాగా ప్రమాదానికి గల కారణం తెలియ రాలేదు.

రైల్వేగేటు మూసివేతపై ఫ్లెక్సీలు



రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సామర్లకోట: స్థానిక రైల్వే గేటు మూసి వేతపై ప్రజలకు అవగాహన కలిగేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక గాంధీ చౌక్ నుంచి కాకినాడ వెళ్లు మార్గంలో ప్రయాణికులు గేటు వరకు వెళ్లకుండా ముందుగానే గేటు మూసి వేసినట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని తెలిపారు. సామర్లకోట–కాకినాడ రోడ్డులో ఉన్న రైల్వే గేటు బుధవారం నుంచి మార్చి 6వ తేది వరకు మూసి వేయనున్నట్టు తెలిపారు. రైల్వే గేటు పరిధిలో ట్రాక్ మరమ్మతుల వల్ల గేటు మీదుగా రాక పోకలు నిషేధించినట్టు తెలిపారు. దాంతో బ్రిడ్జి మీదుగా రాక పోకలు సాగించాలని ఆయన సూచించారు. ఈ అసౌకర్యాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎల్ఐసీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తపల్లి: పిఠాపురంలో మంగళవారం ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. డివిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు రావు మాధవరావు అధ్యక్షతన పిఠాపురం బ్రాంచ్ ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడుగా లోకారెడ్డి రామకృష్ణ, కార్యదర్శిగా కేవీవీ సత్యనారాయణ, ట్రెజరర్‌గా కొత్త రాంబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డివిజన్ కౌన్సిల్ కార్యదర్శి మాలే నాగబాబు, డివిజన్ ట్రెజరర్ పిండి రెడ్డమ్మ, పిఠాపురం బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక ట్రూ గాస్పల్ చర్చి, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రెవరెండ్ డాక్టర్ సువార్తరాజు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ పిఠాపురం సీఎంసీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. అన్ని రకాల కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆపరేషన్లు అవసరమైతే ఉచితంగా చేయనున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాగులో సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

పెద్దాపురం: రైతులు శాస్త్రీయ సాంకేతికతను పెంపొందించుకోవాలని ఏడీఆర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే మేలైన సాగు పద్ధతులను పాటించడంతో పాటు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడుతూ పంటల స్థితిగతులు, చీడపీడల క్షేత్ర ప్రదర్శనలు తదితర విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మునిరత్నం, సీతారామశర్మ, సుధీర్, ఆత్మ పీడీ జ్యోతిర్మయి, వ్యవసాయాధికారులు హరి, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: ఆటోలో అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. వివరాల్లోకి వెళితే... శంఖవరం మండలం గౌరంపేటలో సెబ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఆదే గ్రామానికి చెందిన గనిశెట్టి అప్పారావు ఆటోలో 60 లీటర్ల సారాను తరలిస్తుండగా అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఆటోతో పాటు ఆటోలో ఉన్న 60 లీటర్ల సారాను స్వాదీనం చేసుకున్నారు. గనిశెట్టి అప్పారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. వివిధ కేసుల్లో పరారీలో ఉన్న ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాలకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ దాడిలో సెబ్ ఎస్సై ఎం. ఆశాలత, హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున తదితర సిబ్బంది పాల్గొన్నారు.

5న చెట్ల ఫలసాయానికి బహిరంగ వేలం

తుని: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్, బస్టాండ్ ఆవరణలో ఉన్న 62 మామిడి, 4 సపోటా చెట్ల ఫలసాయం పొందేందుకు మార్చి 5న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. తన కార్యాలయంలో 5వ తేదీ సాయంత్రం 3 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 73829 13016, 73306 51904, 99592 25539 నంబర్లకు ఫోన్ చేసి తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.